సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.358 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 52.358 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.96,280
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,704
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,965
నవర (8 గ్రాములు)	రూ.71,720



వాతావరణం

జిల్లాలో వాతావరణం బుధవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 61 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి డైట్‌లో ఖాళీ అధ్యాపక పోస్టులకు పరీక్షలు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని పల్లిపాడు డైట్‌లో ఖాళీ అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్స్, హెడ్‌మాస్టర్లు, ఎంఈఓలకు బుధవారం నుంచి స్థానిక దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఆల్ లాంగ్వేజీస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, 1 గంట నుంచి 3 గంటల వరకు ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఈవీఎస్, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మ్యాథ్స్ పరీక్షలు జరగనున్నట్లు వివరించారు. గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సైకాలజీ, మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు సైకాలజీ లేదా సోషియాలజీ పరీక్షలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు జి.మనోజ్‌ను 9908413409 నంబరులో సంప్రదించాలన్నారు.

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే యతిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ క్రీడాంశాల్లో ఈ శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు క్రీడా శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, అంతర్జాతీయ, జాతీయ స్థాయి సీనియర్ క్రీడాకారులు సహాయ సహకారంతో నిర్వహిస్తామన్నారు. మే 1 నుంచి 30వ తేదీ వరకు ఈ శిక్షణా తరగతులను నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17వ తేదీ లోపు https://bitly/DSA-SCC-2025 వెబ్‌సైట్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని వివరించారు. ఇతర వివరాలకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

21 నుంచి డీఎడ్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): డీఎడ్ 3వ సెమిస్టర్ 2023–25, 2022–24 బ్యాచ్ విద్యార్థులకు ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు జరుగుతాయన్నారు. డీఎడ్ 1వ సెమిస్టర్ 2024–26 బ్యాచ్ విద్యార్థులకు అదే రోజుల్లో మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు ప్రభుత్వ పరీక్షల అధికార వెబ్‌సైట్ www. bse. ap. gov. inలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

టీజీపీ ప్రత్యేక కలెక్టర్‌గా హుస్సేన్ సాహెబ్

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న డిప్యూటీ కలెక్టర్ డి.హుస్సేన్‌సాహెబ్‌ను తెలుగుగంగ ప్రాజెక్ట్ (టీజీపీ) స్పెషల్ కలెక్టర్‌గా నియమించింది. ఆయన గతంలో నెల్లూరు ఆర్డీఓగా పని చేశారు. టీజీపీ ప్రత్యేక కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శీనానాయక్‌ను ఇటీవల బదిలీ చేయడంతో ఖాళీగా ఉన్న ఆ స్థానంలో హుస్సేన్‌సాహెబ్‌ను నియమించారు.

మెప్మా పీడీగా లీలారాణి

రాజంపేటలో భూసేకరణ ప్రత్యేకాధికారిగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ బి.లీలారాణిని నెల్లూరు జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు మెప్మా పీడీగా పనిచేస్తున్న రాధమ్మ గతంలో చిత్తూరు జిల్లా పీడీగా ఉంటూ ఐదు నెలల క్రితమే నెల్లూరుకు బదిలీపై వచ్చారు. అయితే అంతలోనే ఆమెను బదిలీ చేశారు. తిరిగి చిత్తూరుకు బదిలీ చేసినట్లు సమాచారం.

రౌడీషీటర్‌పై మరోసారి పీడీయాక్ట్ నమోదు

- కడప కేంద్ర కారాగారానికి తరలింపు


నెల్లూరు (క్రైమ్): నెల్లూరుకు చెందిన రౌడీషీటర్‌పై మరోమారు పీడీయాక్ట్ నమోదు చేసి మంగళవారం కడప కేంద్ర కారాగారానికి తరలించారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని చంద్రమౌళినగర్‌కు చెందిన లక్ష్మిశెట్టి సాయితేజ అలియాస్ కమ్మసాయిపై వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. 2022 మేలో ఆయనపై పోలీసు అధికారులు పీడీ యాక్ట్ ప్రయోగించి కడప కేంద్ర కారాగారానికి తరలించారు. సుమారు ఏడాది పాటు జైల్లో ఉండి అనంతరం బయటకు వచ్చినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. నేరాలకు పాల్పడుతూనే ఉన్నాడు. బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో హత్య, మూడు హత్యాయత్నాలు, దోపిడీ, దౌర్జన్యం కేసులు ఉన్నాయి. అతని తీరులో మార్పు రాకపోవడంతో మరోమారు పీడీయాక్ట్ నమోదు చేశారు. మంగళవారం రాత్రి వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసరెడ్డి జిల్లా కేంద్ర కారాగారం రిమాండ్‌లో ఉన్న కమ్మసాయికి నోటీసులు ఇచ్చారు. అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

అభివృద్ధికి పాతర అరాచక జాతర

రియల్టర్లకు రెడ్‌బుక్ పేరుతో చుక్కలు

- వెంచర్లలో ప్రభుత్వ భూమి కలుపుకున్నారంటూ బెదిరింపులు
- సిట్ విచారణ పేరుతో రూ.50 కోట్ల కప్పం డిమాండ్
- పార్టీ కండువా కప్పుకోవాలంటూ హుకుం

కావలిలో తాలిబన్ రాజ్యం నడుస్తోంది. గత పాలకులు పాలనలో, అభివృద్ధిలో పోటీపడి పాలించారు. కానీ నేటి ప్రజాప్రతినిధి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకాలు సాగిస్తున్నాడు. కూటమి అధికారంలోకి వచ్చాక గతంలో ఎన్నడూ లేని విధంగా రౌడీమూకలను పెంచి పోషిస్తూ అవినీతి, అక్రమాలను ప్రశ్నించే ప్రతిపక్షం నుంచి మీడియా స్వరాలపై వరకు ఉక్కుపాదం మోపుతున్నారు. అధికారం దక్కినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ రంగానికి చుక్కలు చూపిస్తున్న ఆయన తాజాగా సిట్ విచారణ పేరుతో ఒక్కొక్కరికి రూ.కోట్లల్లో టార్గెట్ విధించారు.





సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి పాలన వచ్చాక కావలిలో అభివృద్ధికి పాతర వేశారు. అరాచక జాతరకు తెరతీశారు. గడిచిన 11 నెలలుగా నియోజకవర్గంలో విధ్వంస పాలన సాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేరు చెబితే ప్రజల నుంచి ప్రభుత్వ ఉద్యోగుల వరకు, వ్యాపారుల నుంచి కాంట్రాక్టర్ల వరకు వణికిపోతున్న పరిస్థితి ఉంది. ఆయనకు వ్యతిరేకంగా ధిక్కార స్వరం వినిపించిన స్వపక్ష నేతలు సైతం ఇదే స్థితిలో ఉన్నారంటే ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రతిపక్షంలో ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి జైళ్లలో మగ్గ పెట్టారు. కొన్ని చోట్ల ఏకంగా ప్రతిపక్ష నేతలపై దాడులు చేసి, తిరిగి వారిపైనే కేసులు నమోదు చేసిన ఘటనలు లేకపోలేదు. గాయాలతో ఆస్పత్రుల్లో ఉంటే అక్కడికి వెళ్లి దాడులకు తెగబడుతున్నారు. అవినీతిని, అక్రమాలను వెలికి తీసి నిలదీసే మీడియా ప్రతినిధుల గొంతు నొక్కేందుకు వారిపైనా కేసులు పెడుతున్నారు. ఇటీవల ఒక మీడియా ప్రతినిధిని చీకటి గదిలో బంధించి హింసించిన పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులను బెదిరించి వేధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామ స్థాయిలో పని చేసే ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. పంచాయతీల్లో చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా సర్పంచ్‌లను వేధిస్తున్న పరిణామాలు లేకపోలేదు.

రూ.50 కోట్లకు కుదిరిన డీల్

కావలిలో వెంచర్లు వేసుకున్న వ్యాపారులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఓ బంఫర్ ఆఫర్ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముందుగా వ్యాపారులందరూ కలిపి రూ.50 కోట్లు కప్పం కట్టేలా ఒప్పందంతో పాటు పార్టీ కండువా వేసుకోవాలని డిమాండ్ పెట్టినట్లు చర్చ జరుగుతోంది. కావలిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న మహేంద్రయాదవ్, శ్రీనివాసులరెడ్డి, బాలమురళీరెడ్డి, చెన్నకేశవనాయుడు, సుబ్రహ్మణ్యం తదితరులు వైఎస్సార్‌సీపీలో కీలక నేతలుగా చెలామణి అవుతున్నారు. వారందరికీ పచ్చ కండువాలు కప్పి ప్రతిపక్ష పార్టీపై తప్పుడు ప్రచారం చేయించే కుయుక్తులు పన్నుతున్నట్లు సమాచారం.

పేట్రేగిపోతున్న గ్రావెల్ దందాలు

కావలి నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో గ్రావెల్ దందా జరిగిదంటూ ఎల్లో మీడియా పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసింది. వాస్తవానికి గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు, ప్రస్తుత సమయంలోనే గ్రావెల్ దందా పతాక స్థాయిలో జరుగుతుందనేది జగద్విదితం. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కావలిలో ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆధ్వర్యంలో బిట్రగుంట, అల్లూరు, దగదర్తి ప్రాంతాల్లో లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమ రవాణా జరిగింది. ప్రస్తుతం 11 నెలల్లోనే అంతకు మించి రెట్టింపు స్థాయిలో గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతోందని పచ్చ మీడియానే చెబుతోందంటే ఏ స్థాయిలో ఇక్కడ గ్రావెల్ దందా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా రుద్రకోట వద్ద జరుగుతున్న గ్రావెల్ దందాను కవరేజీ చేసేందుకు ఫొటోలు తీసిన ఓ విలేకరిని ఎమ్మెల్యే పోషిస్తున్న రౌడీమూకలు చీకటి గదిలో నిర్బంధించి హింసించే స్థాయికి వెళ్లారు. ప్రస్తుతం దగదర్తి మండలానికి చెందిన టీడీపీ నేత పమిడి రవికుమార్‌చౌదరి ఆధ్వర్యంలో బహిరంగంగానే గ్రావెల్ మాఫియా నడుస్తోంది. దగదర్తి మండలంలోని ఉలవపాళ్ల, దామవరం, సున్నపుబట్టి, కొరుగుంట, కావలిలో రుద్రకోట, బుడమగుంట, ముసునూరు, గౌరవరం, అల్లూరులోని నార్తుఆములూరు, బిట్రగుంటలోని కప్పరాళ్లతిప్ప, ముంగమూరు, కొండబిట్రగుంట, పాతబిట్రగుంట, కడనూతల, కోవూరుపల్లి, బోగోలు ప్రాంతాల నుంచి రోజుకు సుమారు 500 ట్రిప్పుల గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో 30 అడుగుల మేర లోతు వరకు గ్రావెల్ తీయడంతో ఆ గోతులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. సముద్రపు ఇసుకను కూడా వదిలి పెట్టడం లేదు.



కావలిలో గ్రావెల్ అక్రమ రవాణాపై 'ఈనాడు' మంగళవారం ప్రచురించిన కథనం

రియల్ వెంచర్లపై ఉక్కుపాదం

గత ప్రభుత్వ హయాంలో కావలి నియోజకవర్గంలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టు వంటి కీలక ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి. ఈ క్రమంలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. వందలాది ఎకరాల్లో వెంచర్లు వేసి ప్లాట్ల విక్రయాలు చేపట్టారు. కావలి పట్టణం మరింత విస్తరణ జరిగింది. స్థానికంగా వ్యాపారాభివృద్ధి జోరందుకుంది. కూటమి ప్రభుత్వం రాకతో కావలిలో అభివృద్ధి దేవుడెరుగు అవినీతి పుంతలు తొక్కుతోంది. ఈజీ మనీ కోసం ఎమ్మెల్యే కొత్త వ్యూహాలు రచిస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో రియల్ వెంచర్లలో 90 ఎకరాలు భూకబ్జా చేశారంటూ కొత్త రాగం అందుకున్నారు. ఆర్డీఓ ద్వారా విచారణ జరిగిందని ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారంటూ ఎల్లో మీడియా ద్వారా కథనాలు రాయిస్తూ, త్వరలోనే సిట్ విచారణ వేయిస్తామని చెప్పి బెదిరింపులకు దిగారు. ఈ సిట్ బెదిరింపులు పెద్ద డీల్ కోసమే అని రాజకీయ వర్గాల్లోనే కాదు.. వ్యాపార వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

స్వపక్ష నేతపైనే కేసులతో కట్టడి

కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అరాచక పాలనకు ఇదొక మచ్చుతునక. గత సార్వత్రిక ఎన్నికల వరకు కావలి నియోజకవర్గంలో టీడీపీ కీలక నేతగా, ఇన్‌చార్జిగా, ఆశావహ ఎమ్మెల్యే అభ్యర్థిగా వ్యవహరించిన మాలేపాటి సుబ్బానాయుడుపైనే కేసులు పెట్టించి ఆయన్ను సైడ్ చేసిన పరిస్థితి. కృష్ణారెడ్డి టీడీపీలోకి రాక ముందు వరకు ఇక్కడ పార్టీలో బీద బ్రదర్స్‌దే ఆధిపత్యంగా ఉండేది. వారి సన్నిహితుడిగానే మాలేపాటి సుబ్బానాయుడు ఎదిగారు. కృష్ణారెడ్డి ఎమ్మెల్యే కావడంతో పార్టీని ఓన్ చేసుకున్నాడు. బీద బ్రదర్స్‌కు చెక్‌పెట్టేలా వ్యూహాత్మకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం దగదర్తిలో బీద వర్గానికి చుక్కలు చూపించారు. అల్లూరు మండలంలో కూడా బీద వర్గానికి చెక్ పెట్టారు. ఈ పరిమాణాల నేపథ్యంలో తాజాగా బీద రవిచంద్ర మరోసారి ఎమ్మెల్సీ కావడంతో భవిష్యత్ రాజకీయాలు ఏ మలుపు తిరుగుతాయో అనే భయంతో ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

పచ్చదండు బరితెగింపు

విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమి కబ్జా

- వృక్ష సంపద తొలగించి, యంత్రాలతో చదును
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



జేసీబీతో ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న దృశ్యం

వింజమూరు (ఉదయగిరి): మండలంలోని కాటేపల్లి గ్రామ రెవెన్యూలో ప్రభుత్వ భూములపై పచ్చదండు కన్ను పడింది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేశారు. గ్రామ అవసరాల కోసం ఉపయోగించే మందబయలు, పశువులు పోరంబోకు భూమిని టీడీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి తమ అనుచరులతో కలిసి కబ్జా చేస్తున్న విషయం తెలియడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై గ్రామస్తులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండిపోయారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు చర్యలు తీసుకునేందుకు ముఖం చాటేశారనే ప్రచారం జరుగుతోంది. కాటేపల్లి రెవెన్యూ పరిధిలోని 277, 278, 282, 288 సర్వే నంబర్లలో సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీ కుటుంబ సభ్యులు ఈ నెల 9వ తేదీన కొంత భూమి ఆక్రమించి యంత్రాలతో చదును చేశారు. వింజమూరు–గొట్టిగుండాల మార్గంలో తారు రోడ్డుకు అతి సమీపంలో ఉన్న భూమి కావడంతో ఎకరం రూ.లక్షల్లో ఉంది. దీంతో ఈ భూమిపై కన్నేసిన నేతలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆక్రమణకు స్కెచ్ వేశారు. ఈ విషయం అధికార పార్టీలో ఇతరులకు తెలిసి గ్రామ అవసరాల కోసం ఉపయోగించే ఈ భూమి కబ్జా చేస్తే ఇబ్బందిగా ఉంటుందని అడ్డుకున్నట్లు తెలిసింది. దీంతో కొంత కాలంగా మౌనంగా ఉన్న సదరు నేత తాజాగా తన ప్రయత్నాలకు పదును పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 9న కొంత భూమి ఆక్రమించారు. మళ్లీ 13వ తేదీ రాత్రి మరికొంత భూమి ఆక్రమించారు. ఈ భూమికి సంబంధించిన సర్వే నంబర్లపై 145 సెక్షన్ అమల్లో ఉండడం గమనార్హం. మంగళవారం గ్రామ సర్పంచ్ మరి కొంత మంది గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి తహసీల్దార్ హామీద్‌కు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ఆయన స్పందించకపోవడంతో కార్యాలయం బయట కొద్ది సేపు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, నెల్లూరు నగరంలో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్ కమిటీ సభ్యులకు వివరించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతున్న దృష్ట్యా ఏసీ కూరగాయల మార్కెట్ సెంటర్, జిల్లా పోలీసు కార్యాలయం సెంటర్, కేవీఆర్ జంక్షన్, కనకమహల్ సెంటర్, రామలింగాపురం, వీఆర్‌సీ ప్రధాన కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థను మే మొదటి వారంలోగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుజబుజనెల్లూరు నుంచి కోవూరు వరకు జాతీయరహదారిపై ప్రమాదాలు జరుగుతు న్న 11 ప్రాంతాల్లో సోలార్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. జాతీయరహదారిపై వాహనదారులు విశ్రాంతి తీసుకునేందుకు మనుబోలు సమీపంలో సర్వే ల్యాండ్ రికార్డుల అధికారి కొన్ని ప్రదేశాలను ఎంపిక చేశారని, వీటిలో ఒక ప్రదేశాన్ని ఎంపిక చేసి వాహనదారుల విశ్రాంతి కోసం అన్ని మౌలిక వసతులతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, పెయింటింగ్, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పొదలకూరురోడ్డు వద్ద డివైడర్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారిపై మద్యం దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో రద్దీ ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, ఇతర ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారులతో కలిసే పంచాయతీరాజ్ రహదారుల వద్ద ప్రమాదాల నివారణకు 52 ప్రాంతాల్లో భద్రతా చర్యల కోసం రూ.1.68 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు జేసీకి వివరించారు. ఆర్అండ్‌బీకి సంబంధించి ప్రమాదభరిత ప్రాంతాల్లో రూ.1.20 కోట్లతో భద్రతా చర్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఎస్ఈ తెలిపారు. నెల్లూరు నగరంలో 3,200 లైట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పగా, ఇంకా అవసరమైన ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. ఈ సమావేశంలో నెల్లూరు, ఒంగోలు ఎన్‌హెచ్‌ఏ పీడీలు ఎంకే చౌదరి, ఎం. విద్యాసాగర్, సర్వే ల్యాండ్ రికార్డుల ఏడీ నాగశేఖర్, డీఎస్పీ జి. శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కె రామకృష్ణ, మున్సిపల్ ఎస్ఈలు రామ్మోహన్‌రావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ టిప్పర్లు పట్టుకున్నారు.. వదిలేశారు

పొదలకూరు : మండలంలోని మరుపూరు పొలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న నాలుగు టిప్పర్లను సోమవారం రాత్రి తహసీల్దార్ బి.శివకృష్ణయ్య సీజ్ చేశారు. వాటిపై ఎలాంటి చర్యలు లేకుండా కొద్ది సేపటికే వదిలేశారు. కొంతకాలంగా ప్రైవేట్ భూముల్లో గ్రావెల్‌ను తవ్వి నెల్లూరు నగరంలోని లేఅవుట్లు, ఇతర అవసరాలకు తరలిస్తున్నారు. సుమారు నెల రోజులుగా మరుపూరు నుంచి నెల్లూరు నగరం చుట్టు పక్కల ప్రాంతాలకు అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామస్తుల సమాచారం మేరకు తహసీల్దార్ తన సిబ్బందితో కలిసి గ్రావెల్ తరలిస్తున్న మొత్తం నాలుగు టిప్పర్లను సీజ్ చేశారు. వాటిలో మూడింటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించి మరొక టిప్పర్ రిపేరు ఉండడంతో అక్కడే సీజ్ చేసి ఉంచారు. అయితే ఏం జరిగిందో తెలియదు. సీజ్ చేసిన టిప్పర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా విడుదల చేయడంపై అనేక అనుమానాలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మైనింగ్ అధికారులకు సైతం ఎలాంటి సమాచారం అందించలేదని తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్లో అప్పగించిన టిప్పర్లను మంగళవారం విడుదల చేశారు. మరుపూరు ప్రైవేట్ భూముల్లో గ్రావెల్ తవ్వి తరలిస్తున్న వారికి మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ విషయమై తహసీల్దార్ శివకృష్ణయ్య మాట్లాడుతూ సీజ్ చేసిన టిప్పర్ల విషయాన్ని దాటవేస్తూ.. అక్రమంగా గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకుంటామని, టిప్పర్లను సీజ్ చేశామని మైనింగ్‌కు సమాచారం అందిస్తామన్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద ఉంచిన అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు

క్లుప్తంగా

'చాలా సంతోషంగా ఉంది'



మాట్లాడుతున్న యామిని

నెల్లూరు(లీగల్): 'ఇక్కడ పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. కేసుల పరిష్కారంలో సహకారం అందించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు' అని బదిలీపై వెళ్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, ఆరో అదనపు జిల్లా (ఫ్యామిలీ) కోర్టు న్యాయమూర్తి వెంకట నాగపవన్ తెలిపారు. మంగళవారం వారు జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయన్ని సందర్శించారు. న్యాయవాదులతో మాట్లాడారు. కార్యక్రమంలో పలు కోర్టుల న్యాయమూర్తులు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉమ మహేశ్వర్‌రెడ్డి, సుందరయ్య యాదవ్, జాయింట్ సెక్రటరీ వరప్రసాద్‌రావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి జింక



థియేటర్‌లో ఉన్న జింక

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలో మంగళవారం జింక ప్రత్యక్షమైంది. వేసవి నేపథ్యంలో దాహార్తి తీర్చుకునేందుకు జనవాసాల్లోకి వచ్చింది. ఓ థియేటర్‌లోకి వెళ్లగా అక్కడి సిబ్బంది ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. బీట్ ఆఫీసర్ పెంచలయ్య జింకను పట్టుకున్నారు. దానిని అడవిలో వదిలిపెడతామని ఆయన వెల్లడించారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు



మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(అర్బన్): డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ పురుషుల క్రికెట్ పోటీలు బుధవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు నారాయణ వైద్యసంస్థల ప్రాంగణంలో జరుగుతాయని నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని కళాశాలలో వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని 38 మెడికల్, డెంటల్ కళాశాలలకు చెందిన సుమారు 800 మంది ఈ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈనెల 20వ తేదీన విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. సమావేశంలో వైద్య విద్యాసంస్థల కో–ఆర్డినేటర్ డాక్టర్ బిజూ రవీంద్రన్, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ స్కంద గోపాలకృష్ణ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సెల్వి బాబు తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 119
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 214
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 236
లేయర్ చికెన్	: 170



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.105
సన్నవి : రూ.80
పండ్లు : రూ.50

వామ్మో.. నెల్లూరు

పురి విప్పుతున్న పాతకక్షలు

- అదుపు తప్పుతున్న శాంతిభద్రతలు
- హత్యలు, హత్యాయత్నాలతో అట్టుడుకుతున్న నగరం
- భయాందోళనలో ప్రజలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరం నేరపురిగా మారింది. పురి విప్పుతున్న పాత కక్షలు కత్తులు దూస్తున్నాయి. స్నేహితులే హంతకులుగా మారుతున్నారు. కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి. ప్రధానంగా నెల్లూరు నగరంలో రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. మానవత్వం, బంధుత్వం, కుటుంబం భవబంధాలు చూడకుండా అడ్డొచ్చిన వారిని అతి కిరాతకంగా హత్య చేస్తున్నారు. పగలు, ప్రతీకారాలతో భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. అధిక శాతం పాతకక్షలతోనే జరిగినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వరుస హత్యలు, హత్యాయత్నాలతో సింహపురి నెత్తురోడుతోంది. నేరనియంత్రణలో పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని పోలీసులు చెబుతున్నా.. పెరుగుతున్న నేరాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

హత్యలతో కలకలం

నెల్లూరు నగరంలో అసాంఘిక శక్తులు పేట్రేగుతున్నాయి. కత్తులతో సంచరిస్తూ ప్రత్యర్థులను అతి కిరాతకంగా హత్య చేస్తున్నారు. మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని దాడులకు తెగబడుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కత్తుల సంస్కృతి పెరుగుతోంది. కొందరు యువకులు కత్తులు చేతబూని రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నారు. పుట్టిన రోజు వేడుకల పేరిట బహిరంగ ప్రదేశాల్లో భారీ కేక్‌లను కత్తులతో కట్ చేయడం, డీజేలు పెట్టి నడిరోడ్లపై నానాయాగీ చేస్తూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పోలీసులు సైతం చూసీ చూడనట్లు వదిలేస్తున్న పరిస్థితికి కూటమి నేతల ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి నేరాలకు అడ్డుకట్టవేయకపోతే నగరంలో శాంతిభద్రతలు మరింత అదుపు తప్పే అవకాశం ఉంది.



చెత్తకుప్పలో ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సింధుప్రియ, పోలీసులు (ఫైల్)

ఇటీవల జరిగిన ఘటనలు

- కుమార్తెనిచ్చి వివాహం చేయలేదని జాకీర్ హుస్సేన్‌నగర్‌కు చెందిన మహబూబ్‌బాషా అనే వ్యక్తిని షాహీద్ దారుణంగా హత్య చేశాడు.
- పాతకక్షల నేపథ్యంలో ఉడ్‌హౌస్ సంఘంలో పెయింటర్ కల్యాణ్ అలియాస్ చిన్నాను నిందితులు దారుణంగా చంపారు.
- ఇందిరాగాంధీ నగర్‌లో రౌడీషీటర్ సుజన్‌కృష్ణ అలియాస్ చింటూను స్నేహితులు కిరాతకంగా హత్య చేశారు.
- మాగుంట లేఅవుట్‌లో ఖుద్దూస్‌నగర్‌కు చెందిన ఆసిఫ్‌పై మద్యం మత్తులో షఫీఉద్దీన్ కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు.
- సంతపేట పరిధిలోని ఓ వైన్ షాపులో స్వీపర్‌గా పని చేస్తున్న మహిళపై స్నేహితుడు దాడి చేసి గొంతు కోశాడు.
- ఇటీవల కారు డ్రైవర్ వాసును ప్రత్యర్థులు కిరాతకంగా హత్య చేశారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు



మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'వక్ఫ్ సవరణ చట్టం విషయంలో ప్రధాని నరేంద్రమోదీతో కలిసి సీఎం చంద్రబాబు ముస్లింలను నిలువునా ముంచారు. ఆయన ముస్లింల ద్రోహి' అని వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి సమీర్‌ఖాన్ అన్నారు. మంగళవారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమీర్‌ఖాన్ మాట్లాడుతూ అబద్ధపు హామీలిచ్చి ఎన్నికల్లో గెలిచిన చంద్రబాబు ముస్లింలను వెన్నుపోటు పొడిచాడన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ముస్లింలందరూ గమనిస్తున్నారని, అవకాశం వచ్చినప్పుడు గుణపాఠం చెబుతారన్నారు. టీడీపీకి చెందిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్‌తో పాటు ఏ ఒక్క నాయకుడు కూడా ముస్లింలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించకపోవడం దురదృష్టకరమన్నారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవిని అజీజ్ ముస్లింల అండతో తెచ్చుకుని ఎంజాయ్ చేస్తున్నాడు తప్ప వారి కోసం పాటుపడిన దాఖలాల్లేవన్నారు. ముస్లిం నాయకులు నిజాయితీగా రాజీనామాలు చేసి ఉంటే చంద్రబాబు వెనక్కి తగ్గేవాడని తెలిపారు. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో వైఎస్సార్‌సీపీ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. అందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. దేశవ్యాప్తంగా ముస్లింలు జగనన్నకు రుణపడి ఉన్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ హంజా హుస్సేనీ మాట్లాడుతూ మతాల మధ్య చిచ్చు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఓట్లు వేసిన ప్రజలకు అన్యాయం చేయడం దురదృష్టకరమన్నారు. ముస్లిం ఆస్తులను దోచే వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆపగల శక్తి ఉన్నా చంద్రబాబు అలా చేయలేదన్నారు. ఆయన్ను ముస్లిం సమాజం క్షమించదన్నారు. సమావేశంలో జిల్లా ముస్లిం, మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ సిద్దిఖ్, కార్పొరేటర్ సత్తార్, షాకీర్ బాబా, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీపై అనుచిత వ్యాఖ్యలు



మాట్లాడుతున్న నాగార్జున



రూరల్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

- టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపై చర్యలకు వినతి

నెల్లూరు(క్రైమ్): వైఎస్సార్‌సీపీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు సీమరాజా అలియాస్ చంద్రకాంత్ చౌదరి, యష్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి పోలీసు అధికారులను కోరారు. మంగళవారం వారు నెల్లూరులోని బాలాజీనగర్ ఎస్సై విజయ్ శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. వాటిపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని అసత్య ప్రచారాలు చేయిస్తోందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీపై అనుచిత వ్యాఖ్యలు, నేతల, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూరల్ పోలీస్ స్టేషన్‌లో..

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచేలా సోషల్ మీడియాలో ఐటీడీపీ కార్యకర్త పోస్టు పెట్టారని, దీనిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పోలీస్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ ఫొటోను మార్ఫింగ్ చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణుల మనోభావాలు దెబ్బతీసేలా పోస్టులు పెడుతున్నారని చెప్పారు. మహిళలను కించపరిచేలా ఐటీడీపీ వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ శ్యామ్ సింగ్, వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ – పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, 26వ డివిజన్ నాయకుడు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటం

- విధులు బహిష్కరించిన ఉద్యోగులు, కార్మికులు
- ఎన్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా
- కమిషనర్ హామీతో విరమణ



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నేతలు, కార్మికులు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించారు. తెల్లవారుజామున 5.30 గంటలకు కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని ధర్నా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ప్లకార్డులు, సీఐటీయూ జెండాలు చేతపట్టి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. పోలీసుల జోక్యంతో అడిషనల్ కమిషనర్ నందన్ కార్యాలయానికి చేరుకుని యూనియన్ నాయకులు, కార్మికులతో చర్చించారు. అనంతరం కమిషనర్ సూర్యతేజతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించేందుకు నెలరోజులు గడువు ఇవ్వాలని అధికారులు కోరారు. దీంతో నాయకులు, కార్మికులకు ఆందోళనను విరమించారు.

- ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు, సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పలు దఫాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. 60 సంవత్సరాల వయసు నిండిందంటూ 93 మంది కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై ఏ రకమైన సమాచారం లేకుండా పనిలో నుంచి ఆపేయడం సరైన చర్య కాదన్నారు. చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. దుస్తులు, సబ్బులు నూనె, చెప్పులు కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. మహిళలకు పూడికలు తీయడం, ట్రాక్టర్లకు ఎక్కించడం లాంటి పనులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ వర్తించని కార్మికులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే నిరవధిక ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సీఐటీయూ నెల్లూరు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, రూరల్ కార్యదర్శి కె.పెంచలనరసయ్య, రాష్ట్ర నాయకులు పి.సూర్యనారాయణ, మాలకొండయ్య, సుధాకర్, మహిళా సంఘం నాయకులు షేక్ మస్తాన్‌బీ, కత్తి పద్మ, షేక్ షంషాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్, మట్టిపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల స్వాధీనం

కోవూరు: కోవూరు పరిసర ప్రాంత చేపల గుంతల్లో కలిపేందుకు బెంగళూరు నుంచి మినీ వ్యాన్‌లో తీసుకొచ్చిన చికెన్ వ్యర్థాలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ రషీద్ తెలిపారు.

జీవితాలను అర్ధాంతరంగా ముగించి..

ఓ యువతి ప్రేమించి పెళ్లి చేసుకుంది. మరో యువతి ఎన్నో ఆశలతో వివాహం చేసుకుని సొంతూరిని విడిచి భర్తతో నెల్లూరుకు వచ్చింది. అయితే వివిధ కారణాలతో ఇద్దరూ జీవితాలను అర్ధాంతరంగా ముగించారు. కులం తక్కువదానివంటూ అత్తింటి వారు అవమానించడంతో ఒకరు, భర్తతో విభేదాల నేపథ్యంలో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు.



వివరాలు సేకరిస్తున్న అధికారులు

- అత్తింటి అవమానాలు తట్టుకోలేక..

నెల్లూరు సిటీ: వారిద్దరి మతాలు వేరు. పెద్దల్ని ఎదిరించి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే కులం తక్కువంటూ అత్తింటి వారు యువతిని అవమానించసాగారు. దీంతో వివాహమై ఏడునెలలు గడవకముందే మనస్తాపంతో ఆమె బలవన్మరణానికి పాల్పడిన ఘటన నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ముదివర్తిపాళేనికి చెందిన ఎం.స్మైలీ (23) అనే దళిత యువతి నెల్లూరులోని ఓ హాస్పిటల్లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. ఇందుకూరుపేటకు చెందిన నాగూర్‌బాబు, స్మైలీ ప్రేమించుకున్నారు. మతాలు వేరు కావడంతో పెద్దలను ఎదిరించి ఏడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మూడో మైల్లో ఇంటిని అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా నాగూర్‌బాబు కుటుంబ సభ్యులు తక్కువ కులానికి చెందినదంటూ స్మైలీని అవమానిస్తూ వచ్చారు. ఆమె భరిస్తూ వచ్చింది. అయితే వేధింపులు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన స్మైలీ ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి తాడుతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఇంటికి సమీపంలోని వారు తలుపు తట్టగా స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూశారు. స్మైలీ ఉరేసుకుని కనిపించగా నాగూర్‌బాబుకు సమాచారమిచ్చారు. వెంటనే ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న రూరల్ తహసీల్దార్ లాజరస్, రూరల్ సీఐ వేణు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్మైలీ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

భర్తతో విభేదాలతో..

నెల్లూరు(క్రైమ్): దంపతుల నడుమ విభేదాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు మూలాపేట పోలీస్ క్వార్టర్స్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నాగరాజు జిల్లాల పునర్విభజన నేపథ్యంలో నెల్లూరుకు వచ్చాడు. ఆయనకు ఇది వరకే వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. భార్య చనిపోయింది. సుమారు తొమ్మిది నెలల క్రితం పొదిలి ప్రాంతానికి చెందిన పూర్ణిమ (25)ను రెండో వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం వారు మూలాపేట పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. కొద్దిరోజులుగా దంపతుల నడుమ విభేదాలున్నాయి. మంగళవారం పూర్ణిమ భర్తకు ఫోన్ చేయగా డ్యూటీలో ఉన్నానని చెప్పాడు. కుటుంబ సభ్యులు చూస్తుండగానే ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గడి వేసుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. క్వార్టర్స్‌లోని వారు స్థానిక వీఆర్వో మహేష్‌కు సమాచారం అందించారు. ఆయన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

వెంకటాచలం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కురిచెర్లపాడులో మంగళవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కవర్తపు మోహన్ (54) ఆదివారం పొలానికి వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి బయటకు వచ్చాడు. సోమవారం సాయంత్రం వరకు మోహన్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువులో మోహన్ మృతదేహం తేలియాడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు వెల్లడించారు.